స్థల యజమానికి అసలు విషయాన్ని ఆమె చెప్పవలసిన రీతిలో చెప్పి బోధపరిచింది. ఆమె సూచన ప్రకారం ఆ రోజు రాత్రి స్థల యజమాని, అతనికి సంబంధించిన వ్యక్తులు ఆ స్థలం దగ్గరకు వెళ్ళి తాము అక్కడ ఇకమీదట ఎటువంటి త్రవ్వకాలు గానీ, భవన నిర్మాణ పనులు గానీ ప్రారంభించమని" గట్టిగా అరుస్తూ ప్రయాణం చేశారు.

తరువాత వారికి ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాలేదు. ఆ ప్రదేశానికి కొంచెం దూరంలో వేరే భవనం నిర్మించుకున్నారు వాళ్ళు.

ఈ ఉదంతంతో అమెరికాలో లూసీ బర్టన్ పేరు మారుమోగిపోయింది." అన్నాడు అభిరాం.

"పత్రికల వాళ్ళకేముంది ..... వాళ్ళు సేల్స్ పెంచుకోవటానికి ఏదో వ్రాస్తారు. ఇదీ అటువంటి కట్టుకథే అయియుంటుంది" అన్నాడు మహదేవ్.

"అదే పొరపాటు ..... మనం నమ్మని విషయం తెలిసిన వారిని తప్పు పట్టటం మన అవివేకాన్ని తెలియజేస్తుంది. ఎక్కడో అమెరికాలో జరిగిన సంగతి కాబట్టి, అదీ పత్రికల్లో వచ్చింది కాబట్టి అవి నిజమై వుండవంటున్నావు.

మన దేశంలో ..... అదీ మన ఆంధ్రప్రదేశ్‌లో మంత్రశక్తితో పచ్చకామెర్లు నయం చేయబడుతున్నాయన్న సంగతి తెలుసా నీకు?" కాస్త ఆవేశంగా అన్నాడు అభిరాం.

మహదేవ్ ఒకింత ఆశ్చర్యంగా చూశాడు.

"టంగుటూరు దగ్గరిలోని వెంకటాయపాలెంలో వెంకటరత్నం అనే వ్యక్తి, అతని సోదరులు తమ మంత్రశక్తితో పచ్చకామెర్లు నయం చేస్తున్నాడు. ఈ వైద్యం తీసుకొనే మూడువారాల పాటు స్నానం చేయకూడదు. ఆహారంలో ధనియాలపొడి, చింతకాయ పచ్చడి, మినప్పచ్చడి, కందిపప్పు, ఉప్పుతో నల్ల పెసలు ఏ విధంగానైనా వాడుకోవచ్చు.

పొట్లకాయ, పెద్ద చిక్కుడు, బత్తాయి, ఆపిల్, సపోటా తినవచ్చు. సాయంత్రం పూట తప్పకుండా మిరియాల చారు వాడాలి. మందు తీసుకునే ప్రదేశంలోకి చెప్పులతో వెళ్ళకూడదు.

వంశ పారంపర్యంగా తొమ్మిది తరాల నుండి వారు కామెర్లకు వైద్యం చేస్తున్నారు. వారానికి రెండు వందల నుండీ, మూడు వందల మంది రోగులు మద్రాసు, గుంటూరు, కడప, బద్వేలు, మార్కాపురం, నెల్లూరు, విజయవాడ నుంచి వస్తుంటారు.

ఆ గ్రామానికి చేరుకోవాలంటే ఒంగోలుకు దగ్గరలో జి.టి. రోడ్డులో టంగుటూరు స్టేజీలో దిగి గుర్రబ్బండిలో కానీ, రిక్షా లో కానీ వెంకటయ పాలెం చేరుకోవచ్చు. ఒక వ్యక్తి నుంచి వైద్యం నిమిత్తం పది రూపాయలు వసూలు చేస్తారు వాళ్ళు.

మందు తీసుకునేరోజు రోగి ఉదయాన ఏమీ తినకూడదు. కాళ్ళకు చెప్పులు ధరించకూడదు. వైద్యుడు తన చేతులు సబ్బునీటిలో ముంచి తదుపరి ఘాటయిన తెల్లసున్నం రుద్ది కళ్ళముందు మూడుసార్లు వుంచడంతో తొలి విడత వైద్యం పూర్తవుతుంది. ఇలా

చేస్తున్నప్పుడు వైద్యుడు మంత్రోచ్చారణ చేస్తూనే వుంటాడు.

అదేరోజు మరొకసారి ఇలానే చేయడం జరుగుతుంది. ఆ రోజు చికిత్స దాంతో పూర్తవుతుంది. రోగి మూడు వారాలు వరుసగా ఇలా చికిత్స చేయించుకోవలసి వుంటుంది. దాంతో పచ్చకామెర్లు మాయమైపోతాయి" అని చెప్పాడు అభిరాం.

"ఈ కామెర్ల చికిత్స సంగతి నీకెలా తెలుసు?" ప్రశ్నించాడు మహదేవ్.

"క్రితం సంవత్సరం నేను మా అమ్మమ్మకి పచ్చకామెర్లొస్తే చేయించింది ఈ వైద్యమే."

"ఇది మంత్రశక్తి వల్లే నయమైందని నీవు నమ్ముతున్నావా?" అడిగాడు మహదేవ్.

"ఖచ్చితంగా" అన్నాఅభిరాం.

"కేవలం మంత్రశక్తితోనే వ్యాధి నయం చేయగలిగినప్పుడు ఆహార విషయంలో నువ్వు చెప్పిన పరిమితిలెందుకో?" ప్రశ్నించాడు మహదేవ్.

అభిరాంకేం సమాధానం చెప్పాలో తోచలేదు. అందుకే ఆలోచిస్తుండిపోయాడు.

"కాబట్టి డియర్ అభిరాం ..... నా ఉద్దేశ్యం ప్రకారం పచ్చకామెర్ల రోగులకి చికిత్సగా వారు తీసుకోమనే డైట్‌లోనే అసలు కిటుకు అంతా వుండొచ్చు" అన్నాడు మహదేవ్.

"అంటే ..... ?" తెల్లబోయాడు అభిరాం.

"అంటే ఏముంది ..... ? వాళ్ళు రోగికి తీసుకోమనే ఆహారంలోనే వ్యాధిని నిరోధించే గుణం వుండవచ్చు. ఇక సబ్బునీటిలో చేతులు ముంచడం, తెల్లసున్నం కళ్ళముందు మూడుసార్లు వుంచడం, మంత్ర పఠనం, వైద్యం జరిపించుకునేటప్పుడు రోగి పాదరక్షలు ధరించకూడదనటం అంతా షో ..... "

"అంటే మంత్ర తంత్రాలు, మానవాతీత శక్తులులాంటివి ఏవీ లేవంటావ్?" కుర్చీలో వెనక్కి జారపడి అన్నాడు అభిరాం.

"నిస్సందేహంగా!" అన్నాడు మహదేవ్.

"నువ్వు పొరబడుతున్నావ్ మహదేవ్."

"నో ..... " నొక్కి పలికాడు అతను.

"మంత్రాలు, మానవాతీత శక్తులు లేవటానికి మన శక్తి చాలదు. అపరిమితమైన ఈ భూగోళంలో పరిమితమైన ప్రదేశంలోనే సంచరించే మనకు వాటి గురించి తెలియకపోవచ్చు. అంతమాత్రాన అవి లేవని నిష్కర్షగా అనటం సమంజసం కాదు."

"నిజమే! కాని దేనికయినా రీజనింగ్ అనేది వుండాలిగా ..... " అన్నాడు మహదేవ్.

"అంటే రీజన్‌కీ, హేతువుకీ అందని విషయాలు మానవాతీత శక్తులని నమ్ముతావుగా. అయితే విను ..... నూట పదకొండు సంవత్సరాల క్రితం జరిగిన ఓ అపూర్వ సంఘటన ..... ఇంత కాలమైనా దానికి నువ్వు నమ్మే సైన్స్ కారణాన్ని కనుక్కోలేకపోయింది" వుత్సాహంగా అన్నాడు అభిరాం.

"ఏమిటది ..... ?" ఆశ్చర్యంగా అడిగాడు మహదేవ్.

“1886వ సంవత్సరంలో షిర్డీసాయిబాబా ఉబ్బసం వ్యాధికి గురయ్యారు. దాని నుంచి విముక్తులయ్యేందుకు, ఆయన తన ప్రాణాన్ని సమాధిలో వుంచాలనుకుని బాబా భక్తుడైన మహాళ్సాపతితో ‘నా శరీరాన్ని మూడు రోజులు కాపాడంది. అప్పుడు నా శరీరంలో ప్రాణముండదు. కానీ దానిని మృత్యువుగా పరిగణించవద్దు ..... ’ అన్నారు.

ఆ రాత్రే బాబా శరీరం అచేతనమయింది. ఎందరో డాక్టర్లు బాబాని పరీక్షించారు. ఆయన శరీరంలో ఊపిరి నిలిచిపోయిందని, నాడి కూడా ఆగిపోయిందని, గుండె కొట్టుకోవటం కూడా ఆగిపోయిందని, కాబట్టి బాబా పరమవదించారని తేల్చేశారు.

దాంతో ఆ వూరి వాళ్ళంతా బాబా శరీరాన్ని సమాధి చేయబోతే ఆయన భక్తుడైన మహాళ్సాపతి అడ్డుకున్నాడు. కంటికి రెప్పలా మూడు రోజులూ బాబా శరీరాన్ని కాపాడాడాయన.

సరిగ్గా మూడు రోజుల తర్వాత తెల్లవారుజామున మూడుగంటలకు బాబా శరీరంలోకి ప్రాణం ప్రవేశించినట్లు తెలుసుకున్నాడు మహాళ్శాపతి.

శ్వాస, నాడి, గుండె, పనిచేయకపోవడాన్నే ‘మరణం’ అంటారు కదా! మరిదెలా సాధ్యమయింది? ఈ విషయంలో మన అడ్వాన్స్‌డ్ సైన్స్ ఏం జవాబు చెప్పగలుగుతుంది?” రెట్టిస్తూ అడిగాడు అభిరాం.

“ఓకే ..... ఓకే ..... నీతో వాదించటం ఆ బ్రహ్మతరం కూడా కాదు. ఇంకా విషయాన్ని వదిలేయ్” చిన్నగా నవ్వుతూ అన్నాడు మహదేవ్.

“సమాధానం తెలియని వాటి గురించి తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. కానీ పళ్ళికిలించకూడదు” అతను నవ్వటంతో రోషంగా అన్నాడు అభిరాం.

“సరి ..... సరి ..... ఏమిటి అందులో రహస్యం?” నమ్రత నటిస్తూ అడిగాడతను.

“అదే మానవాతీతశక్తి” మహదేవ్‌నే చూస్తూ అన్నాడు అభిరాం,

“మానవాతీత శక్తంటే ..... ?”

“మానవుడికి అతీతమైన శక్తులు. అవి ఈ సృష్టిలో చాల వున్నాయి. సైన్స్‌కి కూడా అందని శక్తులవి ..... ” స్థిరంగా అన్నాడు అభిరాం.

“శ్వాస, నాడి, గుండె పని చేయకపోవడాన్నే డాక్టర్లు చావుగా పరిగణిస్తారని ..... అలా పని చేయకుండా మూడు రోజులుండి తిరిగి బతికిన వ్యక్తి బాబా అని నువ్వన్నావు. ఇది నిజమే- దీన్ని నేనే కాదు, చాలామంది శాస్త్రవేత్తలు కూడా ఆశ్చర్యంతో అంగీకరించారు. నీకొక విషయం తెలుసా?

“మనిషి శరీరంలో థర్డ్‌డైమెన్షన్‌లో ఇంకో శక్తి ప్రవహిస్తుంటుందనీ, దాన్ని ‘కీ’ అంటారనీ, థర్డ్ డైమెన్షన్‌లో కరెంట్‌లా ఈ శక్తి ప్రవహిస్తూ వుంటుంది. చైనావారు దీన్ని ‘మెరీడియన్’ అన్నారు. ఈ మెరీడియన్‌ని కంట్రోల్ చేయడంద్వారా వ్యాధుల్ని నయం చేయవచ్చని చైనీస్ వైద్యశాస్త్రం నిరూపించింది.

శ్వాస, నాడి, గుండె పనిచేయకపోవడమే మరణంకాదు. మానవ శరీరపు థర్డ్ డైమెన్షన్‌లో ప్రవహించే శక్తి మెరీడియన్ ఎప్పుడు పోతుందో అప్పుడే అసలైన మరణం ..... అంతేకాదు ..... సైన్స్ ప్రకారం శరీరంలోని ప్రోటోప్లాజం నశించనంత వరకూ మనిషి ఎన్నిసార్లు చనిపోయినా, తిరిగి బ్రతకడానికి అవకాశం వుంది. ఈ ప్రోటోప్లాజంలో జరిగే మార్పుల్ని అరికట్టగలిగితే అసలు వృద్ధాప్యమనేదే వుండదు" సాలోచనగా అన్నాడు మహదేవ్.

అభిరాం మౌనంగా వుండిపోయాడు.

"సాయంత్రం నీ ప్రోగ్రాం ఏమిటి?"

అతని మూడ్‌ని మార్చడానికి అడిగాడు మహదేవ్.

"ఏముంది? రొటీన్. ఇంటికెళ్ళడం, కాస్సేపు రీడింగ్, భోంచేసి పడుకోవడం."

"ఆదివారం కదా! ఎటైనా వెళదాం. ప్రోగ్రాం ఫిక్స్ చేయకూడదు?"

"ఎక్కడికెళదాం?"

"నీ యిష్టం! రోజువారీ పనులతో విసిగిపోయాను. రేపంతా బయట గడిపి కాస్త రిలాక్స్ కావాలనుంది."

"సరే! రేపుదయం ఎనిమిదింటికి మా ఇంటి కొచ్చెయ్ ..... " ఏదో ఆలోచించి ఒక్క క్షణం ఆగి అన్నాడు.

"హాయిగా, ప్రశాంతంగా ఎంజాయ్ చేసేలా, జంట నగరాల హడావుడికి దూరంగా వెళ్ళేటువంటి ట్రిప్ ఫిక్స్‌చెయ్" లేస్తూ అన్నాడు మహదేవ్.

"అలాగే" కుర్చీలోంచి లేస్తూ అన్నాడు అభిరాం హుషారుగా.

* * * * *

"ఇంకా టిఫిన్ చేయవేం రా?" స్నానం చేసి డ్రస్సయి కూర్చుని ఏదో పుస్తకం చదువుతున్న అభిరాంని అడిగింది అతని అమ్మమ్మ సుమతమ్మ.

" మహదేవ్ వస్తానన్నాడు. వస్తే యిద్దరం కలిసి తింటాం. ఈ రోజు అలా సరదాగా తిరిగొద్దామని అనుకుంటున్నాంలే."

"సరే నీ ఇష్టం" అందామె.

ఇంతలో మహదేవ్ బైక్ సౌండ్ వినిపించడంతో అభిరాం బయటకి నడిచాడు.

"చెప్పిన టైం కంటే ఓ పావుగంట ముందే వచ్చేశావే" వాచీ చూసుకుంటూ అన్నాడు అభిరాం.

"ఇంట్లో ఒకటే బోర్. అందుకే త్వరగా వచ్చేశాను" అని అభిరాం చేతిలోని పుస్తకం వంక చూశాడు మహదేవ్.

'క్షుద్రనాదం' అనే నవలది.

"నీకెంత చెప్పినా మానవేం ..... ఆ దెయ్యాలూ, భూతాల నవలలే చదువుతావు

ఎప్పుడూ?" అన్నాడు.

అభిరాం తేలిగ్గా నవ్వేసి "నీ మోటర్ బైక్ లోపల పెట్టెయ్ నా మారుతీలో వెళదాం" అన్నాడు.

"ఎక్కడికి వెళదామంటావ్ ..... ?" తన బైక్‌ని అభిరాం వాళ్ళ కాంపౌండ్‌లోకి తీసుకొచ్చి లాక్‌చేస్తూ అడిగాడు మహదేవ్.

"టిఫిన్ చేస్తూ మాట్లాడుకుందాం."

"చేసేశానురా."

"అమ్మమ్మ పెసరట్టూ, ఉప్మా వేసిందిరా ..... వద్దంటే నీ ఇష్టం."

"అలాగా! అయితే పద ..... " ఉత్సాహంగా లోపలికి నడుస్తూ అన్నాడు మహదేవ్. ఆమె చేసిన పెసరట్టూ, ఉప్మా అంటే చాలా ఇష్టం అతనికి.

"ఏమిటి మహదేవ్ బాబూ బాగున్నావా?" అతన్ని చూడగానే ఆప్యాయంగా పలకరించింది సుమతమ్మ.

"బాగున్నాను అమ్మమ్మా! నీ ఆరోగ్యం ఎలా వుంది?" ప్రశ్నించాడతను.

"దేవుడి దయవలన బాగానే వుంది బాబూ" అంటూ ఇద్దరికీ ఉప్మా, పెసరట్లు ప్లేట్లలో పెట్టి అందించింది.

"ఉప్మా, పెసరట్టు తింటే నీ చేత్తో చేసినవే తినాలి అమ్మమ్మా" అంటూ ఓ ముక్క పెసరట్టుతో పాటు ఉప్మా తిని అన్నాడు మహదేవ్.

"అది సరే! ముప్పయ్ దగ్గరికి వచ్చేస్తున్నాయి మీ వయస్సులు ..... మరి పెళ్ళెప్పుడు చేసుకుంటారయ్యా ..... ?" అందామె చిన్నగా నవ్వుతూ.

"చేసుకుంటాం అమ్మమ్మా! బ్రహ్మచారులుగా వుండిపోంలే" రోజుకో వందసార్లన్నా, ఆ మాటనందే నిద్రపోని సుమతమ్మతో విసుగ్గా అన్నాడు అభిరాం.

"ఏ వయస్సులో జరిగిపోవలసిన ముచ్చట ఆ వయస్సులో జరిగిపోవాలి. మా కాలంలో మీ ఈడు వాళ్ళకి యిద్దరు, ముగ్గురు పిల్లలుండే వారు. ఏమిటో ఈ రోజులు. ముప్ఫైలు - నలభైలు దాటిపోయాక మగవాళ్ళు, పాతిక ముప్ఫయ్‌లు దాటాక ఆడవాళ్ళు పెళ్ళిళ్ళుచేసుకుంటున్నారు."

"అబ్బబ్బా" చికాగ్గా అన్నాడు అభిరాం.

"సర్లే! మీ యిష్టం నాయనా ఏదో పెద్దదాన్ని ఛాదస్తం" నిష్ఠూరంగా అందామె.

"చేసుకుంటాం అమ్మమ్మా! వచ్చేయేడు కల్లా మా పెళ్ళిళ్ళు అయిపోతాయి. అప్పుడు నువ్వు విశ్రాంతిగా మాకు పుట్టిన పిల్లలతో ముచ్చట్లాడుకోవచ్చు ..... " ఆమెని అనునయిస్తూ అన్నాడు మహదేవ్.